# అనగనగా... ఒక కథ

## జస్ట్... 'మిస్'

నాగమణికి పదో క్లాసు చదువుతుండగానే వాళ్ల బావ రమేశంతో పెళ్లయింది. రమేశంకి పక్క బస్తీలో చిన్న ఉద్యోగం ఇంటర్ ఫెయిలయినా. సిన్సియర్‌గా పనిచేయటం వల్ల 6, 7 వందలు జీతం తెచ్చుకునే స్థాయికి చేరుకున్నాడు.

పెళ్లి కానప్పుడు ఖర్చులెక్కువ ఉండేవి కావు. పొదుపుగా ఉంటూ రెండు మూడు వేలు దాచుకుని వడ్డీకి తిప్పుతూ కొంత డబ్బు పెంచాడు. మావయ్యో పదివేలు కట్నం ఇచ్చాడు. అదీ వడ్డీలు తెచ్చిపెడుతోంది. ఏతావాతా నెలకి వెయ్యో, పన్నెండొందలపైనే ఆదాయం వస్తుంది. ఉన్నంతలో హాయిగానే ఉంటున్నారు. కానీ నాగమణి హాయిగా ఉండలేకపోతోంది. పిల్లలు కలిగి పెద్దవాళ్లయ్యే నాటికి తన ఇంటిని సమస్త సదుపాయాలతో నింపెయ్యాలని బావని సతాయిస్తూంటోంది!

బతిమాలాడు!

బుజ్జగించాడు!!

కోప్పడ్డాడు!!

భార్య మనసు మార్చలేక, దుబాయ్ వెళ్లటానికి నిర్ణయించుకున్నాడు. భార్య గెలిచింది! భర్త ఓడి బొంబాయి వెళ్లే రైలెక్కాడు. పోగేసుకున్న డబ్బులన్నీ ఊడ్చి మావని కాసిన్ని పైసలడిగి పెళ్లాన్ని పుట్టింట్లో దింపి...రమేశం వెళ్లిపోయాడు.

రమేశం 2, 3 నెలలు పోయాక ఓ చోట పని దొరికిందనీ రెండు మూడు నెలల్లో డబ్బు పంపిస్తాననీ రాశాడు. అన్నట్లుగానే ఎవరో వస్తోంటే కొంత డబ్బు పంపించాడు. ఆ తర్వాత రెండుసార్లు ఉత్తరంలో 'నేను వచ్చేస్తానే టిక్కెట్టు కోసం డబ్బు అట్టే పెట్టుకుంటానే'ని రాశాడు. నాగమణి చివాట్లెడుతూ జాబు రాసింది. 'డబ్బు పంపించమ'ని!

రమేశం ఏమనుకున్నాడో...ఏమయ్యాడోగానీ... మరి ఉత్తరాలు రాయలేదు. నాగమణికి మొగుడుతత్వం తెల్సు కనక డబ్బు చెట్టుని నాటి పండించటం అతనికి తెల్సు కనక అక్కడ కరెన్సీ పాతి రూపాయలు పండిస్తాడని, పంపిస్తాడనీ కూడా నమ్మకంగా ఉంది. పైగా తనంటే చచ్చేంత ప్రేమ. నాగమణి అందం మీద తనకన్నా భర్తకే ఎక్కువ నమ్మకం, ప్రేమ.

ఏడాది గడిచింది. తండ్రి చనిపోయాడు. అప్పుడు ఏడిచేడిచి కొంచెం సేపు మొగుడొచ్చి ఓదారిస్తే బావుణ్ననిపించింది. పైగా రమేశానికి మావయ్య అంటే చాలా ఇష్టం. కానీ ఈ వార్త తెలియకుండానే మావయ్య దినాలైపోయాయి.

నాగమణికి కొంచెం కొంచెం తెలిసొచ్చింది.

నాన్న పోయాక ఆ ఇంట్లో తన స్థానం ఏమిటో?!

వేరెళ్లిపోయిన అన్నయ్యనడిగింది.

"నాకు తెల్సి నీ మొగుడింక రాడు! ఎందుకంటే...అతను వెళ్లనంటే డబ్బే ముఖ్యమని...నువ్వే పంపావు..అతను వస్తానంటే భర్తే ముఖ్యం అనుకోకుండా...వద్దన్నావు."

"అయితే ఇప్పుడేమంటావ్"

"నువ్ కూడా ఏదైనా పన్లో చేరు. నీ మొగుడొచ్చేదాకా ఉద్యోగం చేసుకో. చూడు చెల్లాయ్.. సంపాదించిన జీతంలో నీ తిండికి పోనూ మిగిలిన డబ్బులు నీ మొగుణ్ణి రమ్మని రాయటానికి పోస్టు ఖర్చులకి వినియోగించు"

నాగమణి రెండోసారి ఏడిచింది. అన్నయ్య ఇలా మాట్లాడతాడని అనుకోలేదు.

కానీ నాగమణి ఎవ్వరి నీతులూ వినదు. ఎవరి మొట్టికాయలూ తినదు.

"సరే నాకేదైనా ఉద్యోగం చూపించు. ఎలా ఖర్చు పెట్టాలో చెప్పావుగా" నిష్టూరంగా ఉక్రోషంగా అంది నాగమణి.

నాగమణికి రోజులు గడుస్తున్న కొద్దీ టెన్షన్ మొదలవుతోంది. మొగుడికో ఉత్తరం రాసింది గానీ... జవాబింకా రాలేదు. ఈలోగా అన్నయ్య ఫ్రెండ్ రామాచారి గుర్తొచ్చాడు. ఆయనకి ఊళ్లో కొంత పలుకుబడి ఉంది. కొంత హెల్పింగ్ నేచరూ ఉంది.

నాగమణి కథ విని అయ్యో అనుకున్నాడు.

చక్కటి పిల్ల! ఎక్కడికైనా ఉద్యోగానికి పంపినా... మగాళ్ల నుండి ఎలా తట్టుకొస్తుందో.

"ఏదైనా...ఉద్యోగం ఇప్పించండి రామంగారూ. మా అన్నయ్య ఫ్రెండ్‌గా అయినా నాకీ హెల్ప్ చేయాలి మీరు"

రామారావు క్షణంసేపు నివ్వెరబోయాడు. అమ్మాయి ఎవర్నయినా ఇంత ప్రాధేయపడితే తప్పకుండా ఎక్స్‌ప్లాయిట్ చేస్తారని భయం వేసిందతనికి.

"నువ్వు చదివిందా..టెన్త్!! ఏ ట్యూషనైనా చెప్పుకుంటే నెలకో పది మందికి అఆలు, అంకెలూ దిద్దిస్తే ఓ రెండు వందలు రావచ్చేమో ట్రైచేద్దామా..."

"నెలంతా వాళ్లతో అరచీ...రెండొందలు వచ్చినా..." అసంతృప్తిగా అంది నాగమణి.

"ఓకే...నాకు తెల్సున్న ఒకాయన బీడీలు చుట్టి కంపెనీలకి పంపిస్తాడు. నెలకి మూడొందలు పైనే దొరకొచ్చు. ఇమీడియట్ సోర్స్ అంటే...నాకు అదే జ్ఞాపకం

రమేశం ఏమనుకున్నాడో...ఏమయ్యాడోగానీ... మరి ఉత్తరాలు రాయలేదు. నాగమణికి మొగుడు తత్వం తెల్సు కనక డబ్బు చెట్టుని నాటి పండించటం అతనికి తెల్సు కనక అక్కడ కరెన్సీ పాతి రూపాయలు పండిస్తాడని, పంపిస్తాడనీ కూడా నమ్మకంగా ఉంది. పైగా తనంటే చచ్చేంత ప్రేమ. నాగమణి అందం మీద తనకన్నా భర్తకే ఎక్కువ నమ్మకం, ప్రేమ.

వస్తోంది...కానీ..."


"చెప్పు రామం ఏంటి?"

అతను ఆడాళ్ల విషయంలో మంచివాడు కాదంటారు. అందుకనే బాగా వయస్సు మళ్లినవాళ్లు తప్ప అతని దగ్గర ఉద్యోగం చేయట్లేదని ఓ పుకారు కూడా ఉంది"

"భలేవాడివే రామం...ఆడాళ్లు తల్చుకుంటే రావణాసురుణ్నే గడ్డిపరకతో సమానంగా . చూడగలరు. ఏమైనా చేయగలరు. నువ్ భయపడకు"

'నాగమణి ధైర్యం నాగమణికన్నా అందంగా ఉంది' అనుకున్నాడు రామాచారి.

"సరే...నేను అతనితో వెళ్లి మాట్లాడతాను. నువ్ రేపెల్లి పనిలో జాయినవ్వు. ఒక్క మాట...నీకు ఏ రోజు అక్కడ పని చేయడం ఇష్టం లేదో... అప్పుడు తక్షణం మానెయ్యి. నీకు రావల్సిన డబ్బు అణాకాణీల్తో...ఇప్పించే బాధ్యత నాది" అన్నాడు రామం.



నాగమణి "థేంక్స్" చెప్పి వెళ్లింది.

ఆ సాయంత్రం రామాచారి బీడీ చుట్టే సత్యం చావడికెళ్లాడు. "నాకు చాలా ముఖ్యురాలు...వాళ్లన్నయ్య నా ఫ్రెండ్. వాళ్ల నాన్న నాకు గురువు. మన పిల్ల పరాయి చోటికి వెళ్లం కన్నా..." ఏదో చెప్పబోయాడు రామాచారి.

"నువ్వేం భయపడకు బ్రదర్. నువ్ చెప్పేవంటే ఆ పిల్ల ఎంత ఇదో తెలుస్తోంది. రేపు మార్నింగ్ రమ్మను. ఎంత పని చేస్తే అంత ఆదాయం."

"నువ్ కాదనవని నాకు తెలుసు. అందుకే రేపు మార్నింగ్ నిన్ను కలవమన్నాను."

"గుడ్..." సత్యం రామాచారిని సాదరంగా సాగనంపాడు.

రామాచారికి మనస్సులో సత్యం మీద భయం ఉంది. అయితే పనిస్తానన్నవాడు మహానుభావుడు. డబ్బిస్తున్నవాడు దేవుడు-అని నాగమణికి మేలు జరగాలనుకున్నాడు.

నాగమణి ఇంటికెళ్లి "నువ్ వెళ్లు మణీ. జాగ్రత్త...నీకెప్పుడు ఆ జాబ్ నచ్చకపోతే అప్పుడొచ్చేయ్" అని చెప్పాడు.

రామం కన్నా నాగమణి ధైర్యంగానే ఉంది.

"సరే వెళ్లొస్తాను" అంటూ కదిలాడు.

"టీ తాగి వెళ్దురు గాని..."

"వద్దులే. ఇది టీ టైము కాదుగా.."

"మరే టైము??" చాలా అందంగా నవ్వుతూ అడిగింది.

"ఏం లేదులే ఉంటానూ" తనేవన్నా తప్పుగా మాట్లాడతానేమోనని వచ్చేశాడు.

* * *

సరిగ్గా రెండ్రోజులకి సత్యం వచ్చాడు.

"నాగమణి ఉద్యోగంలో జాయినయ్యిందా..."

"ఆ అమ్మాయి చాలా చురుకైంది.."

"పోన్లే పాపం...నెలకో మూడు నాలుగొందలు వస్తే..."

నవ్వాడు సత్యం. "అవును రామం నువ్వేం చెప్పావు ఆ అమ్మాయితో నా గురించి..."

రామం కంగారుగా "ఏం చెప్పాను?"

"నేనో పెద్ద రసికుణ్ణని చెప్పావుటగా"

షాకయ్యాడు. "నీతో చెప్పిందా...ఉద్యోగం మానేసిందా?" అని అడిగాడు.

లేదన్నట్లు నవ్వాడు సత్యం.. అయోమయంగా చూశాడు రామం. "అది కాదు. నీతో చెప్పిందా? ఎప్పుడు చెప్పిందీ" అని అడిగాడు.

"మేమిద్దరం ఆనంద లోకాల్లో విహరించాక...నా చెమట తన చెంగుతో తుడుస్తూ చెప్పింది."

రామం చాలా బాధపడ్డాడు.

"ఏరా బాధపడుతున్నావా.....నువ్ కనక నాగమణికి...నేనిలాటి వాణ్ని అని చెప్పకపోతే నా ట్రయల్ సక్సెస్ అవటానికి చాలా డిలే అయ్యేది. బట్ నువ్ మా ఇద్దరికీ చాలా మేలు చేశావ్..."

రామం ఇంకేం వినట్లేదు. ఆ పిల్ల అలాంటిదని తెలిస్తే తనే నెలకి నాలుగొందల జీతం ఇచ్చేసేవాణ్ణి కదా...అని ఫీలవుతున్నాడు ఆ అమ్మాయిని మిస్ చేసుకున్నందుకు. నాగమణి ఏమవుతుంది! నాగమణి భర్త ఎప్పుడొస్తాడు అని ఎవరూ ఆలోచించట్లేదు...నాగమణితో సహా.

*